నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామారాజు జిల్లా
సోమవారం,7 ఏప్రిల్ 2025


# యధావిధిగా గ్రీవెన్స్ కార్యక్రమం

**– జిల్లాస్థాయితోపాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో నిర్వహణ**

**– జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడి**

**అమలాపురం,మేజర్‌న్యూస్** : ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈనెల 7 సోమవారం ఉదయం 10 గంటలనుండి యధావిధిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్‌లో జరుగునని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితోపాటు డివిజన్, మండలం,మున్సిపల్ స్థాయిలో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం జరుగునని కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్‌స్థాయిగ్రీవెన్స్‌కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూడివిజనల్ అధికారుల కార్యాలయాలలో జరుగుతాయని డివిజనల్‌స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని..ఈకార్యక్రమంలో సంబంధిత మండల తహసిల్దార్లు, మండల అభివృద్ధి అధికారులతో పాటు మండలస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## సీతారాముల కళ్యాణం..

# ఊరురా వైభోగం





**అంతా రామమయం.. జగమంతా రామమయం- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు**

**- రాష్ట్ర ప్రజలకు అయోధ్యుని ఆశీస్సులు మెండుగా ఉండాలి**

**- పలు దేవాలయాల్లో మంత్రి సుభాష్ పూజలు**

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్** : శ్రీరామనవమి వేడుకలు ఆదివారం రామచంద్రపురం నియోజక వర్గంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టిసుభాష్ రామచంద్ర పురం నియోజకవర్గంలోని పలు దేవాలయాలు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, జై శ్రీరామ్ నినాదంతో,రాష్ట్ర ప్రజల సుఖశాంతులు కోరుతూ పూజలు నిర్వహించారు. అంతా రామమయం.. జగమంతా రామమయం అనే భక్తి పారవశ్యంతో రామాలయాలకు విచ్చేసిన భక్తులను చిరునవ్వుతో పలకరిస్తూ.. దేవాలయాలు దర్శించుకున్నారు. ఉదయం నుంచి అత్యధిక సంఖ్య లో భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. ప్రతి ఆలయంలోనూ సీతారామ కళ్యాణాలు కమనీయంగా నిర్వహించారు. ఈకళ్యాణ ఘట్టాన్ని భక్తులు తిలకించి తరించారు. శ్రీరామ నామజపంతో అంతారామ మయంగా మారింది. ముఖ్యంగా రామచంద్ర పురం, సత్యవాడ, వెలంపాలెం, పాతకోట గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పాల్గొన్న మంత్రి సుభాష్ సమక్షంలో,వేదపండితుల మంత్రోచ్చారణ లు, మంగళ వాయిద్యాలు

- తరువాయి 2లో..

# జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీ సీతారామ కళ్యాణం





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** శ్రీరామనవమి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో గల శ్రీ సీతారామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అతి వైభవంగా జరిగింది. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ దంపతులు పెళ్ళి పెద్దలుగా పాల్గొన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా కాకినాడ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ లైన్ నందు రామాలయము నందు ఎఆర్ పోలీస్ వారిచే శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారాముల కళ్యాణం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ సతీ సమేతంగా పీటలపై కూర్చుని వేదమంత్రాల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. శ్రీ సీతారాములవారి కళ్యాణం అనంతరం అన్నదాన

- తరువాయి 2లో..

## గొల్లల మామిడాడ రాములవారిని

# దర్శించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులు

**-అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పణ**





**కాకినాడ,మేజర్‌న్యూస్** : పెదపూడి మండలం గొల్లల మామిడాడలో ప్రసిద్ధ శ్రీ సీతారామచంద్ర మూర్తి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్వామివారి కళ్యాణ మహోత్సవంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి దంపతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ దంపతులు..అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి దంపతులతో కలిసి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరంవేదపండితులు ఆశీర్వచ నాలు కలెక్టర్ దంపతులనుఆశీర్వదించి,తీర్థ ప్రసాదా లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రమణీయంగా జగన్మోహిని

# కల్యాణోత్సవం





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామిఆలయంలో ఈ వారం రాత్రిస్వామివారి కల్యాణోత్సవాలు రమణీయంగా జరిగాయి. ముందు పురుషరూపంలో వెనుక భాగం జగన్మోహనీ స్త్రీ రూపంలో ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలోవచ్చి స్వామివారి కల్యాణ మహోత్స వాల్లో పాల్గొన్నారు.

ఉదయం స్వామివారికి వేద పండితులు శ్రీనివాసాచారులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గరుడ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం ధ్వజారోహణతో స్వామి వారి కల్యాణోత్సవాలు ప్రారంభించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి సమర్పించారు. స్వామివారి కల్యాణోత్సవాలు తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఏర్పాట్లను ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. రాత్రి వేద పండితులు నిర్వహించినకల్యాణఘట్టంలో గ్రామస్తు లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రమణీయంగా తిలకించారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ వేడుకలలో పెద్ద రామాలయం వద్ద పాతపాటి రామాంజనేయులురాజు లక్ష్మీ దంపతులు వారి కుటుంబ సభ్యులు రామాలయంలో ఉన్న రాములవారికి సీతమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు, తాడు, నల్లపూసలు, వెండి వస్తువులు మొత్తం విలువ 5 లక్షలు రూపాయలు, చేయించి, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామివారికి ఇందుకూరు వెంకటరామరాజు మంగతాయారు దంపతులు రెండు కేజీల వెండితో సుమారు 2 లక్షల 50 వేలు, ముదునూరి గోపాలకృష్ణరాజు రామసీత దంపతులు స్వామివారికి రూ.60 వేలు విలువ చేసే వెండి పాదాలు, ముదునూరి రామరాజు రామ దంపతులు రూ.40 వేలు విలువచేసే బంగారు నామం స్వామివారికి అందించి స్వామికి అలంకరించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోదండరామస్వామి ఆలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారామచంద్రస్వామివారి దర్శనం భక్తిశ్రద్ధల తో చేసుకున్నారు. పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే పలు ఆలయాల వద్ద సాంప్రదాయబద్ధంగా బెల్లం పానకం భక్తిశ్రద్ధలతో తయారుచేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. పెద్ద రామాలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సీతారాముల కళ్యాణం.. ఊరురా వైభోగం

మొదటిపేజి తరువాయి

నడుమ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు కమనీయంగా,కనులపండుగగా జరిగాయి. స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు.భక్తులకు బెల్లం పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, ఆయా గ్రామాల కూటమి నాయకులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీ సీతారామ కళ్యాణం

మొదటిపేజి తరువాయి

కార్యక్రమం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవమునకు పెద్ద ఎత్తున ప్రజలు, పోలీస్ సిబ్బంది, అధికారులు హాజరైనారు. అదనపు ఎఆర్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం ఎస్డీపివోలు,ఎఆర్‌డిఎస్పీ శ్రీ హరిరావు, ఎఆర్ ఇన్స్పెక్టర్లు, కాకినాడ పట్టణం ఇన్స్పెక్టర్లు, జిల్లా కార్యాలయ వివిధ విభాగాలు ఇన్స్పెక్టర్లు కుటుంబ సమేతంగా మరియు సిబ్బంది, స్థానిక భక్తులు హాజరై కళ్యాణం తిలకించారు.

# ఏలేశ్వరంలో శ్రీరామ శోభాయాత్ర

**ఏలేశ్వరం, మేజర్‌న్యూస్ :** శ్రీరామనవమి పురస్కరించుకుని ఆదివారం ఏలేశ్వరంలో రామభక్తులు పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ నాయకులు గట్టెం వెంకటరమణ, హైందవ సమాజం నాయకులు మెలిపాక నాగేంద్ర ల ఆధ్వర్యంలో రామభక్తులు పెద్ద ఎత్తున ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. స్థానిక లింగంపర్తి రోడ్డు సత్తెమ్మ తల్లి గుడి నుండి ప్రారంభమైన శోభాయాత్ర లింగంపర్తి నుంచి వారి పేట మీదుగా అంబేద్కర్ నగర్ రామాలయం, దిబ్బల పాలెం రామాలయం వద్దకు చేరుకుంది. దెబ్బల పాలెం రామాలయం వద్ద గూనాపు అప్పలరాజు ఆధ్వర్యంలో మహిళలు శోభాయాత్రకు మంగళహారతి ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం పల్లపు వీధి రామాలయం మీదుగానీలి పేట రామాలయం, పైడి మల్లమ్మ గుడి వీధి రామాలయం నుండి లింగవరం కాలనీ చేరింది. ఈ శోభాయాత్రలో విశ్వహిందూ పరిషత్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రామనామ సంకీర్తనలు చేశారు. కాషాయం జండాలు జైశ్రీరామ్ నినాదాలతో నగరమంతా మార్మోగింది ఈ కార్యక్రమంలో గొల్లపల్లి త్రినాథ్, పెచ్చెట్టి కృష్ణ, నూకల సుబ్రమణ్యం, స్వర్ణ పూడి శ్రీనివాసరావు, పాబోలు వెంకటేశ్వర్లు, ముచ్చర్ల రమేష్, దలేవిజ్జు తదితరులు నాయకత్వం వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం



– పాల్గొన్న భక్తులు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ దేవస్థాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పరిశీలించారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**టీ.నర్సాపురం,మేజర్‌న్యూస్:** మండలంలోబిజెపి 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మక్కినవారి గూడెం, అప్పలరాజు గూడెంలోనూ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగాసభలో మండల అధ్యక్షులు దామ్మిశెట్టి సాయి విశ్వనాథ్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అన్ని రంగాల్లో ముందంజ ఉండటానికి కారణం బిజెపి పార్టీని అన్నారు .ప్రధాని మోడీ చేస్తున్న కృషి అమోఘం అన్నారు.1980లో స్థాపించినా పార్టీలో 15 ఏళ్లుగా మోడీ ప్రధానమంత్రిగా ఉండటం అనేది గర్వకారణం అన్నారు. ఇతర దేశాల్లో కూడా భారతదేశం గురించి గర్వంగా చెప్పుకునే స్థాయి ఈరోజు మన దేశానికి ఏర్పడిందన్నారు.ఈ కార్యక్రమంలో దామి శెట్టి కేశవరావు, మాలింపాటి హరిచంద్ర ప్రసాద్, మక్కిన శ్యాంసుందర్రావు, సాదు ప్రసాద్,పాటూరి సత్యనారాయణ, సిరిమళ్ళ సత్యనారాయణ, బొప్పన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ అద్భుత పాలన



**ద్వారక తిరుమల,మేజర్ న్యూస్:** భారతీయ జనతా పార్టీ 45వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాలు మండల అధ్యక్షులు చిలక వీరస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు వారి ఇళ్ల పై పార్టీ జెండాలు కట్టుకోవడం,అలాగే ప్రతి శక్తి కేంద్రీ ఇంచార్జ్ పరిధిలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం మండల కేంద్రమైన ద్వారక తిరుమలలో శివాలయం కొండపైకి వెళ్ళు ఆర్చి గేటు వద్ద జెండా దిమ్మను ఏర్పాటు చేసిపార్టీ జెండాను ఎగరవేసిమిఠాయిలు ఒకరికి ఒకరు తినిపించుకున న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ఈరోజు దేశంలో అతిపెద్ద పార్టీగా ఎదిగిందని దేశంలో వివాదాస్పద సమస్యలను పరిష్కరిస్తూ నరేంద్ర మోడీ అద్భుత పాలన అందిస్తున్నారని వీరస్వామి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాయవాది మైల బత్తుల శ్రీధర్ మృతి

## నివాళులర్పించిన ప్రముఖులు



**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** ప్రముఖ న్యాయవాది, మైలా బత్తుల శ్రీధర్ (58) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారంమధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దళిత నాయకులు ఇంజేటి జాన్‌కెనడి, కాకిలేటి ఆనంద్ కుమార్,(మధు)అడిదెల శరత్, వర్దనపు ఏసురత్నం,గమిడి మధుబాబు, మైలా బత్తుల పింకు,పాస్టర్ ఈద జాషువా, న్యాయ వాదులు గోడి సత్యనారాయణ,చెన్నూరి వెంకటేశ్వరరావు,దేవ రంజిత్ తదితరులు సరిపల్లిలోని శ్రీధర్ నివాసం వద్దకు వెళ్లి ఆయన మృతదేహంపై పుష్పగుచ్చా లు వేసి నివాళులర్పించారు.

# మండలంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు







**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించు కొని మండలంలో వాడ వడలా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజవొమ్మంగి గాంధీ సెంటర్‌లో శ్రీ కోదండ రామ ఆలయం, కమ్మరిపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసిద్ధి కోదండ రామాలయం,శాంతినగర్ రామాలయంలలో భక్తులు తెల్లవారుజాము నుండి శ్రీసీతారాములను దర్శించుకొని పూజలు నిర్వహించారు. స్వామి వారికి పానకం, చలివిడి వడపప్పు నైవేద్యంగా సమర్పించారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పానకం, తీర్థ ప్రసాదాలు అందించగా కొన్ని చోట్ల అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గాంధీ సెంటర్‌లో ఉన్న రామాలయం వద్దముప్పన్న కేశవ్ దంపతులు, కమ్మరి పేటలో ఉన్న రామాలయం వద్ద మిరియాల అప్పన్న బాబు దంపతులు పీటల మీదకూర్చుని శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. అప్పలరాజుపేట,శరభవరం, జడ్డంగి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర,కొండపల్లి,దూసరపాము,బడదనాంపల్లి, వట్టిగడ్డ, చెరుకుంపాలెం, అమీనాబాద్, కోమరాపురం, వాతంగి,లో దొడ్డి తదితర గ్రామాలలో ఉన్న రామాలయాలలో భక్తులు తెల్లవారుజాము నుండి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాములోరి కళ్యాణం జరిపించారు.

# నేటి నుండి వాడపల్లి వెంకన్న కళ్యాణ మహోత్సవాలు




**- సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దిన ఆలయం**
**- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డిసి చక్రధర్ రావు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుపతిగా పేరొందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి వారం రోజులపాటు వైభవంగా జరగనున్నాయి. సోమవారం అంకురార్పణ, ధ్వజారోహణ, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రి 7 గంటలకు కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. భక్తులకు తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. రహదారులు, కల్యాణ వేదిక వాహనాల ప్రాంగణాలను విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు. ఆలయం వద్ద మాడ వీధుల్లో ఏడు శనివారాలు ఏడు ప్రదక్షిణలు చొప్పున చేసి స్వామివారిని దర్శిస్తే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. 7న ఉత్సవాల అంకురార్పణ, ధ్వజారో హణం 8న ఎదుర్కోలు ఉత్సవం, రథోత్సవం, రాత్రి 7 గంటలకు కల్యాణం 9న శాంతి హెూమం, పొన్నవాహన మహెూ త్సవం 10న సదస్యం 11 తెప్పోత్సవం12 న మహాపూ ర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణ, 13న శ్రీపుష్పోత్సవం (పవళింపు సేవ)తో ఉత్సవాల ముగింపు.

1931లో వాడపల్లి తీర్థం రోజున రథోత్సవం జరుగుతుండగా రథం మీద ఉంచిన గాంధీ చిత్రపటాన్ని, త్రివర్ణ పతాకాన్ని బ్రిటీషు పాలకులు తొలగించడంతో వారిని ఎదిరించి తుపాకీ గుళ్లకు బలై పలువురు దేశభక్తులు అసువులు బాశారు. అందుకే ఇక్కడ రథోత్సవ కార్యక్రమానికి ప్రత్యేకత నెలకొంది. కళ్యాణోత్సవాలు తిలకించేందుకు రాష్ట్రాల నుండి లక్షలాదిమంది వచ్చే అవకాశం ఉన్నందున వారికి తగ్గ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ఉత్తరాధిమఠంలో నవమి వేడుకలు



**రాజమండ్రి, మేజర్ న్యూస్ :** శ్రీరామనవమి సందర్భంగా స్థానిక ఉత్తరాధిమఠ ప్రాంగణమైన మల్లికి సత్రం లోసీతారాముల కళ్యాణమహెూత్సవం ఘనంగా జరిగింది. సుధా పండితులు విజయ సింహాచారి పర్యవేక్షణలో ఆంధ్ర మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పవన్ దంపతులు, సారంగ ఆదిత్య దంపతులచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గృహ స్థులు పాల్గొన్నారు. కళ్యాణ అనంతరం. తీర్థ ప్రసాదం వితరణ జరిగిం ది. ఈ కార్యక్రమానికి సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తున్న సుధా పండ ితులు విజయ సింహాచారికి ధన్యవాదములు తెలియచేసారు. అలాగే కార్యక్రమానికి వివిధ సేవల ద్వారా సహకరించిన అందరికీ సమాఖ్య తరపున కార్యదర్శి కందాళం నరసింహారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. కార్యక్రమంలో యాతగిరి వెంకట సుబ్బారావు, కాకులవరపు భరణి కుమార్, బారు రమణారావు, కాకులవరపు జయరామారావు, కందాలం నివాసరావు, పొద్దుటూరు సత్య, చిల్లరికె వెంకట అనాజీరావు, కోపిల్లి నరసింహారావు, అంగర రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్ లోని శ్రీ విరాట విజయ ఆంజనేయ స్వామి సహిత శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ సూర్య సాయికిరణ్ అర్చకత్వంలో ప్రత్యేక పూజలు చేయగా వేద పండితులు ఇంద్రగంటి పవన్ శర్మ శ్రీ సీతారామ కళ్యాణం వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, స్థానిక సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వేంకటేశ్వరరావు, ధార్మిక సంస్థలు విశ్వహిందూ పరిషత్, ఆర్.యస్.యస్., సమరత సేవా ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అద్భుతం శ్రీ కోదండ రామస్వామి కళ్యాణ మహెూత్సవం తిలకించి భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం మహెూత్సవం, చక్రస్నానం, ఇంద్రగంటి పవన్ శర్మ ఆధ్వర్యంలో జరిపిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈనెల 16వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన జరుపుతామని ఆలయ కమిటీ ప్రకటించింది. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేసుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వేంకట రామారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాగా ఏజెన్సీ ప్రాంతంలో వాడ వాడలా శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

వడగళ్ల వాన :రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వడగళ్ల వాన పడింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో వారపు సంతకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## ఏప్రిల్ నెల 30 లోపు పన్ను చెల్లించేవారికి 5% రిబేటు - కమీషనర్

**కాకినాడ,మేజర్న్యూస్ :** ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారము 2025-2026 సంవత్సరమునకు సంబంధించినటువంటి ఆస్తి పన్నులను ఏప్రిల్ నెల 30వ తారీఖు లోపు ఒకేసారి చెల్లించేవారు ఆస్తి పన్నుపై 5% శాతం రిబేట్ పొందవచ్చునని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల ఆఖరిలోపు చెల్లించేవారికి మాత్రమే ఈ రిబేటు అందనుందన్నారు. ప్రజలకు డిమాండ్ నోటీసులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఇంటి పన్ను నంబరు లేదా డోర్ నెంబర్ తో పన్ను చెల్లింపు కేంద్రానికి వచ్చినా గాని పన్ను చెల్లింపు చేయవచ్చునన్నారు. కావున నగర ప్రజలు 5% శాతం పన్ను తగ్గింపును ఉపయోగించుకోవలసినదిగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కోరారు.

## చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన డిఎల్పిఓ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా డిపిఓ రవికుమార్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పెద్దాపురం డిఎల్పిఓ ఎం.బాలామణి పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త నుండి సంపద తయారీ విధానాన్ని పరిశీలించి, సేంద్రియ ఎరువులు తయారుచేసే విధానం తద్వారా ఆదాయం సమకూర్చాల్సిన ఆవశ్యకతను, చెత్త సేకరణ వంటి వివరాలను పంచాయతీ సెక్రటరీ నక్కా సత్యనారాయణమూర్తిని అడిగి వివరాలు తెలుసుకుని సంపద కేంద్రం ముఖ్య ఉద్దేశం, చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ఐ.వి.ఆర్.ఎస్.కాల్స్ పై వివరాలు అడిగి సమాచారం సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు ఆమె వెంట ఉన్నారు.

## శ్రీరామనామస్మరణతో మార్మోగిన ఆలయాలు




**రావులపాలెం, మేజర్ న్యూస్ :** శ్రీరామనవమి వేడుకలు ఆదివారం రావులపాలెం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహించారు. రామాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అన్ని ఆలయల్లలో సీతారామ కళ్యాణాలు అత్యంత వైభవ్వేతంగా నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకలు భక్తులు ఆసక్తిగా తిలకించారు. శ్రీరామ నామ జపంతో అంతా రామమయంగా మారింది. ముఖ్యంగా రావులపాలెం, ఉబలంక, గోపాలపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హాజరయ్యారు. పండితుల మంత్రోచారణలు, మంగళ వాయిద్యాలు నడుమ సీతారాముల కళ్యాణ మహెూత్సవాలు కమనీయంగా జరిగాయి. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కళ్యాణం కన్నులు పండుగగా జరిగించారు. భక్తులకు బెల్లం పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఆలయాలపై రాజకీయ నేతల సవారీ

- రాజకీయ నేతలకు అలంకారంగా మారిన ఆలయ చైర్మన్ పదవులు
- దశాబ్దాలుగా ఇదే వరవడి
- రాజకీయ పెత్తనం లేకపోవడంతో ప్రశాంతంగా ముగిసిన గత శివరాత్రి ఉత్సవాలు
- ఆలయాల చైర్మన్, సభ్యులుగా ఆధ్యాత్మిక వేత్తలను నియమించాలని డిమాండ్
- పవన్ కళ్యాణ్ ప్రక్షాళన చేయాలంటున్న భక్తులు






**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** పిఠాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీపాద వల్లభ, శ్రీ కుక్కుటేశ్వర, కుంతీ మాధవ ఆలయాలపై రాజకీయ నేతల సవారీ పరిపాటిగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలకు చెందిన నాయకులకు ఆలయ చైర్మన్ మరియు పాలక మండలి సభ్యుల పదవులను కట్టబెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయాల్లో పాలక మండలి ఏర్పాటు నుండి ఇదే వరవడి కొనసాగుతుంది.

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఉన్న ప్రముఖ ఆలయాలైన శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానం, దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కుక్కుటేశ్వర స్వామి (పాదగయా క్షేత్రం) దేవస్థానం, సుదీర్ఘ చరిత్ర కలిగిన కుంతీ మాధవుని ఆలయాలలో ఆలయ చైర్మన్లు మరియు పాలక మండలి సభ్యులుగా కూర్చునేందుకు కూటమి పార్టీలలోని నేతలు ఇప్పటి నుంచే తెర వెనక పావులు కదుపుతున్నట్టు తెలుస్తుంది. ఆలయాలలో రాజకీయ నేతల ప్రమేయం, పెత్తనం కారణంగా కీలకమైన ఉత్సవాల సమయంలో సామాన్య భక్తులకు చోటు దక్కకపోవడం, ఆలయ నిత్యవ్యవహారాలలో రాజకీయ నేతలు జోక్యం చేసుకోవడం ఆవేదన కలిగించే అంశం. స్థానిక ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ముందు చూపుతో... గతశివరాత్రి ఉత్సవాలలో ఎటువంటి రాజకీయ పెత్తనం లేకుండా చేయడంతో...ఉత్సవాలు ప్రశాంతంగా జరిగిభక్తులమన్ననలు పొందాయి. పిఠాపురంలోని ప్రముఖ ఆలయాలపై పవన్ కళ్యాణ్ మరింత దృష్టి సారించి ఆలయపాలక మండలిలో సభ్యులుగా, చైర్మన్లుగా భక్తి భావం గల వారిని, సామాజిక వేత్తలను,ఆధ్యాత్మిక చింతన కలిగిన వారిని, హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడే వారిని నియమించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది. పిఠాపురంలో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఆలయాలలో రాజకీయ నేతల ప్రమేయాలను తగ్గించి ఆధ్యాత్మికత వెల్లువిరసే విధంగా సనాతన ధర్మ పరిరక్షణకు పూనుకున్న పవన్‌కళ్యాణ్ ముందడుగు వేయాలని భక్తులు కోరుకుంటున్నారు. ఈవిధమైన వరవడి పవన్‌కళ్యాణ్ తన నియోజక వర్గంలో నుంచే చేపట్టాలన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. గతం జరిగిన దానిని విడిచిపెట్టి ఇకనుండి అయినా ఆలయాలలో రాజకీయ నేతల పెత్తనాన్ని ప్రాతినిధ్యాన్ని తగ్గించాలని భక్తులు కోరుకుంటున్నారు.

# వాకర్స సంఘానికి కుర్చీలు వితరణ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** బోటు క్లబ్ వాకర్స సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు స్పందించి విబి వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంచర్ల రాఘవరావు, సత్యనారాయణలు సుమారు 20వేల రూపాయలు విలువ గల 50 కుర్చీలను అందజేశారు.

స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విశ్రాంతి డిఎంఈ రాఘవేంద్ర రావు మాట్లాడుతూ సమాజ హితం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విబివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. పరోపకార గుణంతో జీవిస్తేనే జీవితం సార్థకం అవుతుందని అన్నారు. కంచర్ల రాఘవరావు మాట్లాడుతూ వాకర్స్ సంగం చేస్తున్న సేవలకు స్పందించి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కుర్చీలను అందజేశామని అన్నారు.

అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేస్ కుమార్, కంచర్ల రాఘవరావులను ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో వాకర్స సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు,సూర్యనారాయణ, నాగేశ్వరరావు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల అన్యోన్య జీవనం సర్వ మానవాళికి ఆదర్శం - డా అడ్డాల



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆశోక్‌నగర్‌లో డా.అడ్డాల సత్య నారాయణ గృహంలో 12వ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈసందర్భంగా డా.అడ్డాల మాట్లాడుతూ మన దైనందిక జీవనంలో శ్రీ సీతారాములను ఆదర్శంగా తీసుకుని,ఆ మహనీయులు చూపిన బాటలో పయనిస్తే ఎటువంటి ఇబ్బందులు దరి చేరవని అన్నారు. మహోన్నత విలువలతో జీవించి పరిపూర్ణ మానవుడిగా మనకు ఆదర్శప్రాయంగా నిలచి, ఎన్నో సుగుణాలూ, ప్రత్యేకతలూ మూర్తీభవించిన ఆదర్శప్రా యులు శ్రీరామచంద్రమూర్తి అని అన్నారు.

వేద సమానమూ, అతి పవిత్రమైన శ్రీరామనామ మాధుర్యాన్నీ, శ్రీరామరూప వైభవాన్నీ, శ్రీరామపాద మహిమనూ, గురితప్పని ఆయన బాణ పటిమనూ ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. 'రామ' అని ఒక్కసారి ఉచ్చరిస్తేచాలు అది విష్ణు సహస్రనామాలన్నిటినీ పఠించి నంతటి ఫలాన్నిస్తుందని సాక్షాత్తూ పరమశివుడు పార్వతీదేవికి తెలిపా రని అన్నారు. 'రా' అనే అక్షరం మనలోని కల్మషాలను బయటకు వెడలజేస్తే, 'మ' అనే అక్షరం మళ్ళీ ఏ కల్మషాలూ మనలో ప్రవేశి ంపకుండా ఒక అడ్డుగోడలా నిలచి రక్షిస్తుంది, కనుక, అటువంటి రామ నామాన్ని నిత్యమూ భజించాలని కోరారు. ఆ సీతారాముల అన్యోన్య జీవనాన్ని ఆదర్శంగా తీసుకుని సర్వ మానవాళి సుఖ సంతోషాలతో జీవితం గడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జానకిరమ, సాహితి, వీరభద్రరావు, అరుణ రేఖ, రుక్మిణి, డా. చైతన్య, కుమార్, దేవి, ప్రజలు పాల్గొన్నారు.

# విశ్వదశమికి శ్రీకరం శ్రీరామనవమి

– గణపతి పీఠంలో భద్రాద్రి శ్రీరామ పాదుకలకు ప్రత్యేక పూజలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచల శ్రీరామ పాదుకలకు కాకినాడ స్వయంభూ భోగి గణపతి పీఠంలో సహస్ర నామస్తోత్ర పారాయణతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. చెరకుగడల పందిరి నడుమ కళ్యాణ తలంబ్రాలతో సీతారాముల సనాతన సంప్రదాయ వేడుక లక్ష్మణ ఆంజనేయ స్వామివార్లకు విశ్వావసు నవమి పూజలు కొనసాగించారు. భక్తులకు బెల్లం పానకం, వడపప్పు, చెరుకు గడలు పంపిణీ చేసారు. పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ నవమి అంటే విశ్వదశమికి దారి తీయించే లోక కళ్యాణ వారధిగా నిలిచిన విష్ణు స్వరూప స్వచ్ఛప్రకాశమన్నారు. భారత భూమిపై రామాలయం లేని గ్రామం ఉండదన్నారు. సంస్కృతి వారసత్వ భాగ్యంగా శ్రీరామ నవమి ప్రఖ్యాతి చెందిందన్నారు.

# అభయాంజనేయస్వామి ఆలయంలో పులిహోర పానకం, మజ్జిగ పంపిణీ



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలోని భక్తుల సహకారంతో ఎటపాక గ్రామం మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ రామభక్త అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద సుమారు 2000 మంది భక్తులకు పులిహోర, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాటి చలపతిరావు, నక్క నరసింహారావు, సరిహద్దు వెంకన్న, పాటి సంపత్ కుమార్, బాచినేని శ్రీకాంత్, మువ్వ సందీప్, పాలడుగు నవీన్, కొర్రపాటి సాయి, దుద్దుకూరి వినోద్, సద్దెనపు సత్యనారాయణ, మువ్వ రామకృష్ణ, దాడి రామకృష్ణ, కొతుర్తి శ్రీకాంత్, దాడి రమేష్, బలుసు బాబి, అనుకోజు ఆశిష్, దుద్దుకూరి సాయి సాత్విక్, జక్కుల సందీప్, రాసాల బాలు తదితరులు పాల్గొన్నారు.

# పురుషోత్తపట్నం గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి సన్నిధికి అతి సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తుల కోలహాలాల మధ్య ఎంతో కన్నుల పండుగగా జరిగింది. అనంతరం వచ్చిన భక్తులందరూ కూడా తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసినటువంటి అన్నదాన కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుందురు రామిరెడ్డి, అర్తిమల్ల రామచంద్రరావు, ఆకుల శ్రీనివాసరావు, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, అన్నెం ఏడుకొండలు రెడ్డి, మోర్తాల రామిరెడ్డి, జయచంద్రారెడ్డి, చేకూరి రామ్మోహన్రావు, పుట్టి వెంకటయ్య, బారెడ్డి లక్ష్మారెడ్డి, దామెర్ల రేవతి, పోతుగుంట్ల బాలకృష్ణ, దుద్దుకూరు శ్రీనివాసరావు, పుట్టి శ్రీనివాసరావు, విజ్జగిరి రవితేజ, పంతాడి అంజి మరియు గ్రామంలోని పెద్దలు, రామభక్తులు మరియు గ్రామస్తులందరూ పాల్గొనడం జరిగింది.

# 'బిజెపి'తోనే భారత దేశంలో అభివృద్ధి సాధ్యం





**– బిజెపిలో చేరిన ప్రముఖ సామాజిక సేవకులు కారం సీతారామన్న దొర**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజన గ్రామాల అభివృద్ధి 'బిజెపి' తోనే సాధ్యమనే ఆలోచనతో భారతీయ జనతా పార్టీలో చేరినట్లు ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త కారం సీతారామన్న దొర(ఢిల్లీ బాబు) విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు పార్లమెంట్ పరిధిలోని రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త, ఆదివాసీ సంరక్షణ సమితి (ఆదివాసీ జాగృతి) జాతీయ అధ్యక్షులు కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) ఆదివారం రాజమండ్రిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు పురంధేశ్వరి సమక్షంలో సుమారు 500 మంది అనుచరులతో బిజెపి పార్టీలో చేరారు. ముందుగా రంపచోడవరం నుంచి భారీ ర్యాలీగా రాజమండ్రి బయలుదేరారు. ఆతర్వాత అరకు పార్లమెంట్ పరిధిలోని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా బాధ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులు కారం సీతారామన్న దొర ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం, శ్రీ రామనవమి రోజున సీతారామన్న దొర తదితరులు పార్టీలో చేరడం శుభ సూచకమని, గుర్తుండి పోతుందన్నారు. మన్యంలో బిజెపి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కారం సీతారామన్న దొర మాట్లాడుతూ భారత దేశపు ఘనమైన ప్రాచీన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడం, దేశాన్ని అభివృద్ధి పథంలోకి పయనింపజేయడం భారతీయ జనతా పార్టీ వల్లే సాధ్యమని పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో బిజెపి ప్రభుత్వం ప్రపంచంలో భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్ది, అభివృద్ధి బాటలో ప్రయాణిస్తూ, దేశంలో గిరిజన గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుందని, గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న తీరుకు ఆకర్షితులై బిజెపి పార్టీలో చేరడం జరిగిందన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కేవలం బిజెపి తోనే సాధ్యమన్నారు. భారతీయ జనతా పార్టీని గిరిజన ప్రాంతాల్లో బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను మన్యం ప్రజలకు తెలియజేస్తూ, అర్హులకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం అసెంబ్లీ కన్వీనర్ వీకా బుల్లి కొండలు దొర, పార్లమెంట్ కన్వీనర్ బివి భారతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి, కురసం సుబ్బారావు దొర, తురసం సుబ్బారావు, గురు ప్రసాద్, కుంజం వెంకటేశ్వర్లు, కొండ్ల కృష్ణారెడ్డి, శ్రీను, మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యులు పలువురు పాల్గొన్నారు.

## మహారాణి సత్రం నందు వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

**– ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప, కౌడా ఛైర్మన్ తుమ్మల బాబు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మహారాణి సత్రం నందు ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ వేడుక కార్యనిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ దంపతులచే అర్చకులు నిర్వహించారు. అనంతరం కళ్యాణం పురస్కరించుకుని వార్షికంగా నిర్వహించిన అన్నదానంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు జాకెట్ ముక్క, విసనకర్రలు సత్రం కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్య ంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, సత్రం రైతులు, వేదపారాయణదారులు, అర్చకులు, సమీప దేవస్థానాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 9న బీసీ కార్పొరేషన్ లోన్లుకు ఇంటర్వ్యూలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి చెంది బీసీ కార్పొరేషన్ లోన్ల కొరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 9న మండల పరిషత్ కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్, జడ్డంగి బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలో బీసీ లోన్ పొందుటకు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల9 మధ్యాహ్నం 3 గంటలకు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

# భగవద్గీత గ్రంథం బహుకరణ

**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణ వాస్తవ్యులు బర్ల నాగమణి కుమారుడు శ్రీనివాస్, వారి బంధువులు ఆంజనేయులు శ్రీరామనవమి పురస్కరించుకుని పెద్దాపురం మండలం, గోరింట పెదరామాలయం ఆలయ కమిటికి భగవద్గీత బహుకరించారు. ఈ సందర్భంగా శివరామబాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు, మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఈ భగవద్గీత గ్రంథం చదవనవసరం లేకుండా ఎలక్ట్రానిక్ పద్ధతిలో వాయిస్ వినిపిస్తుందని, ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలుపుతూ బహుకరించిన దాతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఆవిర్భావ దినోత్సవం



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మండలంలోని ఎర్రవరం గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 57వ బూత్ అధ్యక్షులు గౌడుగు నల్లబ్బాయి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా పూర్వ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా చిలుకూరి రాంకుమార్ మాట్లాడుతూ బిజెపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలను బిజెపి జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించడం జరిగిందని, గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,శక్తి వంచన లేకుండా పార్టీ కోసం పనిచేయాలని ఆయన అన్నారు.అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి గ్రామంలోనూ పండగ వాతావరణం నెలకొందని,భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల రూరల్ అధ్యక్షుడు నీలి సురేష్,పూర్వపు అధ్యక్షుడు కూరాకుల రాజా,యువ మోర్చా అధ్యక్షుడు గరికినాగు తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జర్నలిస్ట్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా మధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో విశేష పూజలు ఘనంగా జరిగింది. నవమి సందర్భంగా సీత రామ విగ్రహాలకు ప్రత్యేక పూజలు మరియు శ్రీ ఆంజనేయస్వామికి తమలపాక పూజలు శ్రీ సత్యదేవ లక్ష్మీదేవులకు పుష్పాలంకరణలు తోపాటు భక్తుల అందరి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్వేష్ మాట్లాడుతూ శ్రీరాములవారు స్వయంగా అర్చించిన శ్రీ మూల రామ విగ్రహాలు నేడు ఉత్తరాది మఠంలో శ్రీ సత్యాత్మ తీర్థ స్వామిజి నిత్యము ఆ విగ్రహాలను అర్చించడమే కాక భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పిస్తున్నారని చెప్పారు. ఈ సంవత్సరం అయోధ్య శ్రీ బాల రామ స్వామి వారి సన్నిధానంలో ఉత్తరాది మఠ సంస్థాన పూజ ద్వారా మూల రాములవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు స్వామీజీ నిర్వహించడం మనందరి భాగ్యంగా మద్వేష్ ప్రస్తావించారు. అయోధ్య మూల రామ పూజా కార్యక్రమంలో మఠానికి చెందిన పండిత రంగాచారి గుత్తల్, పండిత సత్య ధ్యాన ఆచార్ కట్టి, పండిత విద్యాధీశాచార్ గుత్తల్ వంటి ప్రముఖులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం గొప్ప అదృష్టంగా మద్వేష్ వివరించారు. ఈనెల 12వ తేదీన హనుమద్ జయంతి సందర్భంగా సత్యదేవ మందిర ప్రాంగణంలో శ్రీ దాస ఆంజనేయస్వామి ఆరవ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా పవమాన హోమం తోపాటు పలు హోమాలను నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులందరూ పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకులు పరశురామ్, తుంగమణి, మౌనిక, రమామణి, రఘోత్తమ మరియు భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలతోపాటు పానకము, వడపప్పు అందజేశారు.

# గొడ్రాలు అనే మాట పడలేకే.. ఈ నాటకం..!




రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ : రాజమహేంద్రవరంలో కలకలం సృష్టించిన గర్భిణి కొప్పిశెట్టి సంధ్యారాణి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. దేవీపట్నం మండలం ఇందుకూరిపేటకు చెందిన కొప్పిశెట్టి సంధ్యారాణి 9 నెలల గర్భిణి కావడంతో ఆమె భర్త రాజమహేంద్రవరంలోని జయ కిడ్నీకేర్ ఆసుపత్రికి గురువారం పురిటికి తీసుకువచ్చాడు. ఆసుపత్రిలో ఆమెకు ఓపీ చీటీ రాశారు. డాక్టర్ చూసేలోగా ఆమె రెండుసార్లు బయటకు వచ్చింది. అలా మూడోసారి బయటకు వచ్చి కనిపించకుండా పోయింది. దీంతో కంగారుపడిన సంధ్యారాణి భర్త విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు తెలిపాడు. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై షేక్‌సుభాణీ, మరికొంత మంది పోలీసులు రెండు టీములుగా విడిపోయి ఆచూకీ కోసం గాలించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సంధ్యారాణి ఫోన్ ఆధారంగా కాకినాడలో ఆమె ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడ బస్టాండ్‌లో ఆమెను పట్టుకున్నారు. పోలీసులు ఆమెను ప్రశ్నించగా... తనను ఎవరో కిడ్నాప్ చేశారని, తనకు ఇద్దరు కవల పిల్లలు పుట్టారని, ప్రసవం అయిన వెంటనే పిల్లను ఎవరో ఎత్తుకెళ్లిపోయారని, పలు రకాలుగా పోలీసులకు తెలిపింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

**-9 నెలలు గుడ్డలు పెట్టుకుని గర్భిణిగా..**

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో దుర్గను పరిశీలించిన వైద్యులు ఆమె గర్భిణి కాదని తేల్చి చెప్పారు. దీంతో హతాశులయిన పోలీసులు తేరుకుని ఆమె ఈ నాటకం ఆడడానికి గల కారణాలను తెలుసుకున్నారు. దుర్గకు పెళ్లి అయి తొమ్మిది సంవత్సరాలు అయ్యింది. ఆమెకు పిల్లలు లేరు. దీంతో ఆమె బయటి వారు, ఇంటిలో కుటుంబ సభ్యులు ఆమెను గొడ్రాలుగా చూస్తున్నారు అనే భావనతో తనకు కడుపు వచ్చినట్లు నాటకమాడింది. ఈ తొమ్మిది నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలని, భార్యాభర్తలు చాలా దూరంగా ఉండాలని తెలిపింది. సంధ్యారాణి డాక్టర్ దగ్గరకు వచ్చి లోపలికి వెళ్లినప్పుడు తనకు గర్భం ఎందుకు రావడం లేదని మాత్రమే అడిగి బయటకు వచ్చేసేది. బయట భర్తను కూర్చోపెట్టి ఆ సమయంలో ఆమె ఒక్కతే డాక్టర్ వద్దకు వెళ్లేది. డాక్టర్ అంతా బావుందని, పురుడు వచ్చే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారని తెలిపేది. దీంతో దుర్గ భర్త నిజమని నమ్మి ఆమెను కంటికి రెప్పలా చూసుకోసాగాడు. ఆమె కడుపు రోజురోజుకీ పెరుగుతున్నట్లు గుడ్డలు పెట్టుకుని కాలం వెళ్లదీసింది. చివరికి ఆ తంతు బయట పడడంతో ఆమె పరిస్థితిపై జాలిపడడం పోలీసుల వంతైంది. పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును వేగంగా ఛేదించిన త్రీటౌన్ సీఐ వద్రే అప్పారావు, ఎస్సై షేక్‌సుభానీ, పోలీసు సిబ్బందిని ఎస్పీ డి.నరసింహాకిశోర్ అభినందించారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన 500 కేజీలు రేషన్ బియ్యం స్వాధీనం



రాజానగరం,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన రాజానగరంలో అక్రమంగా నిల్వ ఉంచిన 500 కేజీల రేషన్ బియ్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక తాహసిల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. వారికి వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో పెళ్లిస్థానిక నూకాలమ్మ గుడి వీధిలో ఒకఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన11 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి సంబంధిత వ్యక్తి పై6 ఏ కేసు నమోదు చేసినట్లు తాహసిల్దార్ తెలిపారు. ఈ దాడిలో తాహసిల్దార్ సత్యనారాయణ, విఆర్వో సూర్యకాంతం, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా శ్రీరామ శోభాయాత్ర



జగ్గంపేట, మేజర్‌న్యూస్ : జగ్గంపేటలో ఆదివారం భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి ఆధ్వర్యం లో శ్రీరామ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. జగ్గంపేటలోని సోమాలమ్మ తల్లి వారి ఆలయం వద్ద నుంచి ఈ శోభ యాత్ర బయల్దేరి గ్రామం లో ఉన్న అన్ని రామాలయాల మీదుగా పుర వీధుల్లో ఈ శోభ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ ధర్మ పరిషద్ జాతీయ ప్రధాన కార్యదర్శి పొదుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు హాజరై మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రామ భక్తులు పాల్గొని, రామాలయాలను దర్శించుకున్నారు.

## పెరవలి మండల వ్యాప్తంగా అంబరాన్ని అంటిన శ్రీరామనవమి వేడుకలు



పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ నెలకొన్న రామాలయాల వద్ద శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 6 వ తేదీ ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, లలితా సహస్రనామాలు చదవడం, మేళ తాళాలతో పూలతో అలంకరించిన రథాలలో పల్లకీలలో స్వామి వారి గ్రామోత్సవాలు ,భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోనే 19 రామాలయాలు కలిగి ఉన్న ప్రత్యేక గ్రామం ఖండవల్లి గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాలు అంబరాన్నంటాయి. ప్రతీ వీధి వీధినా నెలకొల్పబడిన శ్రీరాముల వారి ఆలయముల వద్ద సీతారాముల కళ్యాణాలను నిర్వహించి పానకం, వడపప్పు ప్రసాదాలను, విసనకర్రలను భక్తులకు పంచిపెట్టారు. తీపర్రు గ్రామంలో కమ్మ రామాలయం వద్ద భక్తులలో పోటీ కారణంగా ఒకే వేదికపై నాలుగు జంటలు తో రాములవారి కళ్యాణం నిర్వహించారు. ముక్కామల మెరక వీధి రామాలయం వద్ద అక్కిన కాశీ విశ్వేశ్వర రావు దంపతులచే, గాంధీ చౌక్ లో ఆర్యవైశ్య సంఘం వారిచే నిర్వహించుచున్న శ్రీరామనవ వేడుకల్లో మానేపల్లి శ్రీనివాస్ దంపతులచే, పల్లపు వీధి రామాలయం వద్ద నిడదవోలు గోపాలం కుటుంబ సభ్యులచే రాములవారి కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. పెరవలి మండల వ్యాప్తంగా శ్రీరామనవమి సందర్భంగా జరిగిన వేడుకల్లో మంత్రి దుర్గేష్ తో పాటు అనేకమంది ప్రముఖులు, కూటమి నాయకులు, భక్తులు పాల్గొని వేడుకలకు వన్నె తెచ్చారు.

## విద్యుత్ స్తంభాలపై ఉన్న కండక్టర్ వైర్లు చోరీ



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట పట్టణ శివారు పిఠాపురం రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లు శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు.సుమారు 20 స్తంభాలపై వున్న 5 లైన్ ఎల్.టి కండక్టర్ వైర్లు ఎక్కడికి అక్కడే ముక్కలు ముక్కలు కటింగ్ చేసి చోరీకి పాల్పడ్డారు.

## పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సి.హెచ్. సునీత పేర్కొన్నారు. ఆదివారం కోరుకొండ మండలం శ్రీ రంగ పట్నం గ్రామంలో జరుగుతున్న జాతీయ సేవా పథకం లో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు మూడవ రోజు గ్రామ వీధులలో స్వచ్ఛ భారత్ ర్యాలీ మరియు పెరటి తోటల పెంపకం పై అవగాహనా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత మన బాధ్యతే అంటూ వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం విద్యార్థిని, విద్యార్థులు స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామ వీధులను శుభ్ర పరిచారు. ఈ ర్యాలీ లో వ్యవసాయ కళాశాల ఎన్. ఎస్. ఎస్. ఆఫీసర్ డా. సిహెచ్. సునీత, డి. సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మద్దాల రమణ పాల్గొన్నారు.పెరటి తోటల పెంపకంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సి.హెచ్. సునీత రైతులకు అవగాహన కల్పించారు.

## సోమవారం ఏప్రియల్ 7న కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

- కలెక్టర్ పి.ప్రశాంతి



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రతి సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార కోసం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం ఏప్రియల్ 7వ తేదీ సోమవారం యధావిధిగా కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రంలో, మునిసిపల్ కార్పొరేషన్ పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్, మండల కేంద్రంలో ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు , జిల్లా, డివిజన్ మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు.

# శ్రీరామనవమి వేడుకల్లో ముస్లింలు మజ్జిగ వితరణ

**ఆలమూరు, మేజర్ న్యూస్ :** మత సామరస్యాన్ని దాటుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా అలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో ఆదివారం జరిగిన శ్రీరామనవమి వేడుకలలో రామాలయం వద్ద అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేసారు.సీతారాముల కళ్యాణం వేడుకలలో బాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ జిల్లా అధ్యక్షులు షేక్ సుల్తాన్ మాట్లాడుతూ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ వ్యవస్థాపకులు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ శ్రీరామచంద్ర మహారాజు, శ్రీకృష్ణ మహారాజుల్ని గొప్ప దైవ సందేశ హరులుగా పేర్కొన్నారుని, సర్వ మతాల సారాంశం ఒకటేనని బోధించారనీ, ఇలాంటి మతసామరస్య కార్యక్రమాలను దేశవ్యాప్తంగా కమ్యూనిటీ నిర్వహిస్తోందన్నారు. జిల్లా ఇంచార్జ్ మహమ్మద్ సిరాజ్ మాట్లాడుతూ హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అ.స) 1889వ సంవత్సరంలో పంజాబ్ రాష్ట్రం ఖాదియాన్ నగరంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీని స్థాపించారని, వారు ఇస్లాం వ్యవస్థాపకులు ముహమ్మద్ ప్రవక్త చేసిన భవిష్యవాణి ప్రకారం తానే వాగ్దాత్త మసీహ్ అని ప్రకటించారు. ఈ కమ్యూనిటీ నేడు ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో శాంతి, సమానత్వం, న్యాయం మరియు మతసామరస్యంతో కూడిన సమాజ నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకొని, 'అందరిని ప్రేమించు – ఎవ్వరినీ ద్వేషించకు' అనే నినాదంతో 'హ్యూమానిటీ ఫస్ట్' శాఖ ద్వారా మానవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కమ్యూనిటీ ప్రస్తుత ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి నగేష్ ,ఈదర రమేష్, కొత్తపల్లి కృష్ణ, కమ్యూనిటీ రాష్ట్ర ప్రజా సంబంధాల ప్రతినిధి మహమ్మద్ జావిద్ అహ్మద్, మౌల్వి ముహమ్మద్ అక్బర్, మీను పాషా, గుల్ మీరా తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ద్రోన్ సహాయంతో పేకాట రాయుళ్లను పట్టుకున్న పెరవలి పోలీసులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** డ్రోన్ సహాయంతో పేకాట రాయుళ్లను పట్టుకున్న పెరవలి పోలీసులు. వివరాల్లోకి వెళ్తే ఏప్రిల్ ఆరో తేదీ ఆదివారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాపవరం గ్రామం సరిహద్దు పొలాలలో మామిడి చెట్ల కింద పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పెరవలి ఎస్సై యం. వేంకటేశ్వర రావు తమ సిబ్బంది సాయంతో అక్కడికి వెళ్లి అక్కడ నుంచి డ్రోన్ ఎగురవేసి వారు ఎటువైపు వెళ్తున్నారో గుర్తించి వారిని పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 5 మంది వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 4,010 రూపాయలు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం పరుచుకోని వారి పై కేసు నమోదు చేస్తామని పెరవలి ఎస్ఐ ఎం వెంకటేశ్వరావు తెలియజేశారు.

# కాటన్ బ్యారేజీ వద్ద స్నానాలు నిషేధం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** బొబ్బర్లంక ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ దిగువ భాగంలో స్నానాలు చేయడం నిషేధించడమైనదని ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డిఎస్పి సుంకర మురళీకృష్ణ, సిఐ సిహెచ్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు ఆదివారం ధవలేశ్వరం బ్యారేజ్ వద్ద బొబ్బర్లంక, పిచ్చుక లంక ప్రాంతాలలో బ్యారేజ్ దిగువ భాగంలో పిచ్చుకలంక వద్ద గోదావరి నదిలో స్నానాలు చేయుచున్నవారిని గుర్తించి అక్కడ నుంచి పంపించి హెచ్చరించడమైనది. సర్ ఆర్డర్ కాటన్ బ్యారేజ్ దిగువన గోదావరి నదిలో స్నానాలు చేసి చాలామంది యువకులు చనిపోయారని, ఆ ప్రదేశం వద్ద స్నానాలు చేయరాదని వారికి సూచించడం జరిగినది. నిబంధనలను అతిక్రమించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించడం జరిగినది. స్నానాలు చేయుచున్నవారిని డ్రోన్ సహాయంతో గుర్తించి అక్కడ నుంచి పంపించడం జరిగినది.

## కానూరు శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్





**పెరవలి, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు గ్రామంలో ఏప్రిల్ 6వతేదీ ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక రామాలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కానూరు గౌడ సంఘం రామాలయ శ్రీరామనవమి వేడుకల్లో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ముఖ్యఅతిథిగా స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి కళ్యాణం అనంతరం భారీ స్థాయిలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ పాల్గొన్నారు.ఈ వేడుకలలో భక్తులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** శ్రీరామనవమి సందర్భంగా జగ్గంపేట టీచర్స్ కాలనీలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, వైసిపి ఇంచార్జ్తోట నరసింహం, జ్యోతులు చంటిబాబు నాయకులు హాజరై ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో పాటు మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకు హాజరై కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు రామాలయాలలో నిర్వహించిన కళ్యాణ వేడుకలు ఎంతో ఆనందచోహరంగా భక్తులు ఆధ్వర్యంలో జరిగాయి. అయితే నియోజవర్గ కేంద్రమైన జగ్గంపేటలో టీచర్స్కాలనీ రామాలయంలో కళ్యాణ వేడుకల్లో ప్రత్యేకతను పొందింది.ఈ కళ్యాణ వేడుకల్లో నిమ్మలపూడి వీరాంజనేయ ప్రసాద్ విజయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కళ్యాణాన్ని జరిపించుగా పైన ఉదాహరించిన నియోజకవర్గ ప్రముఖులు ముఖ్య నాయకులు హాజరై ఆశీర్వదించడం జరిగింది వందలాదిమంది భక్తులు కల్యాణోత్సవానికి హాజరయ్యారు.

## శ్రీరామ్ నగర్ రామాలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించిన బొండాడ జగన్ శ్రావణ లక్ష్మి దంపతులు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా జగ్గంపేటలో పలు కాలనీలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. శ్రీరామ్ నగర్ సీతారాముల ఆలయంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బొండాడ జగన్ శ్రావణ లక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరంస్వామి వారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు సేకరించారు. సీతారాముల కళ్యాణం వీక్షించేందుకు విచ్చేసిన భక్తులకు పులిహోర, మజ్జిగ,బెల్లం పానకం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవాసంఘం గౌరవ అధ్యక్షులు బోండా నూకబాబు, సమ్మెట సాయిరాం, వెంట్రరా ప్రగడ రంగబాబు, మానేపల్లి వీర్రాజు గుప్తా, కంచర్ల శ్రీనుబాబు, గెడ్డమూరి బాబ్జి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నాగబాబుతో గౌరీ నాయుడు మర్యాదపూర్వక భేటీ

**– ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన గౌరీ నాయుడు**



**పిఠాపురం,మేజర్న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి ఎమ్మెల్సీగా ఎన్నికైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబుని యువ సాహితీవేత్త, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు, సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ లీడర్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడు కాకినాడ జిల్లా పిఠాపురం గోకులం గ్రాండ్ హొటల్లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగబాబుతో గౌరీ నాయుడు పలు అంశాలు చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ కళాశా లలో విద్యను బోధిస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అధ్యాపకులకు గంటలు చొప్పున కాకుండా కన్సాలిడేటెడ్ జీతం ఇచ్చేలాగ,రెగ్యులర్అధ్యాపకుల బదిలీలు జరిగినప్పుడు కాళీ పోస్టుల్లో అతిథి అధ్యాపకులను నియమించే లాగ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్తో మాట్లాడాలని గౌరీ నాయుడు కోరారు. పిఠాపురం కేంద్రంగా నెలకొల్పిన సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కార్యక్రమాల గురించి నాగబాబు గౌరీ నాయుడునీ అడిగి తెలుసుకున్నారు. సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కోఆర్డినేటర్గా విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే అనేక కార్యక్రమాలు కళాశాలలో, పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు గౌరీనాయుడు తెలియజేశారు. త్వరలో పిఠాపురం సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ కార్యాలయాన్ని సందర్శిస్తానని నాగబాబు చెప్పినట్లు గౌరీ నాయుడు పేర్కొన్నారు. పిఠాపురంలో జన్మించి జాతీయస్థాయిలో సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన సోమ సుందర్ ఇంటిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని నాగబాబు తెలిపారు. పిఠాపురం సాహితీవేత్త, అభ్యుదయ కవి డాక్టర్ ఆవంత్స సోమ సుందర్ స్మారక కేంద్రం ఏర్పాటు చేయటానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని, అలాగే పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని నాగబాబు ప్రకటించడం పట్ల సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు నాగబాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పొలిటికల్ సెక్రటరీ, జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ (టిట్కో) చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, భీమిలి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పంచకర్ల సందీప్, చోడవర జనసేన ఇంచార్జ్ పి వి ఎస్ ఎన్ రాజు, పిఠాపురం టౌన్ జనసేన నాయకులు చెల్లుబోయిన సతీష్, తదితరులు పాల్గొన్నారు.